క్లుప్తంగా

బిపిన్‌రావత్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భైంసాటౌన్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం తొలి సీడీఎస్ బిపిన్ రావత్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు దేశానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. బాలాజీ సూ త్రావే, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులు ఉన్నారు.

సరుకులు పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన రిషి (12)అనే బాలుడు బ్రెయిన్ ట్యూమర్‌తో గురువారం మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థ సభ్యులు శుక్రవారం నర్సాపూర్ వెళ్లి రిషి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.నాలుగు వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. సంస్థ కోఆర్డినేటర్ కరుణ కుమార్, సభ్యులు రాజు, రాజేశ్వర్ తదితరులున్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యురాలు ప్రత్యూష

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు ప్రత్యూష 150 మంది బాలికలను పరీక్షించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడారు. తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరం ఉంటే కేజీబీవీ సిబ్బందికి చెప్పి పీహెచ్‌సీకి రావాలని సూచించారు. హెచ్‌ఈవో శేషయ్య, సిబ్బంది ఏఎన్‌ఎం సుగుణ, ఆశా కార్యకర్తలు శారద, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు న్యాయం'

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తరహాలో రేవంత్‌రెడ్డి పాలన ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై చిన్నచూపు చూసిందన్నారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గం

భైంసాటౌన్: పట్టణంలో భైంసా డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోట్‌పెల్లి సతీశ్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ బషీర్, దేవ్కె విలాస్, జనరల్ సెక్రెటరీగా కుంట రాజేశ్వర్, కోశాధికా రి గా గంధం వెంకట్, పీఆర్వోగా రామకృష్ణతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు.

'ఉద్యమకారులను గుర్తించాలి'

భైంసాటౌన్: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం నూతన ఎమ్మెల్యేలను కలిసి విన్నవిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు డా ముష్కం రామకృష్ణాగౌడ్ అన్నారు. ఈ మేరకు నూతన ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, వెడ్మ బొజ్జుకు శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం విస్మరించిన జిల్లాలోని తెలంగాణ అమరుల కుటుంబాలకు, ఉద్యమంలో పోలీసు కేసులు, బైండోవర్లతో ఇబ్బందులకు గురైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని నూతన ఎమ్మెల్యేలను కలిసి విన్నవిస్తామని పేర్కొన్నారు.

తనిఖీ బృందం పర్యటన



సింగన్‌గాంలో పరిశీలిస్తున్న సభ్యులు

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో 2022-23లో చేపట్టిన ఉపాధి పనుల వివరాలను శుక్రవారం తనిఖీ బృందం సభ్యులు నమోదు చేసుకున్నారు. మండలంలోని మొగ్లి, ఎల్వి, సింగన్‌గాం, జౌలా(బి), బెంబర, ఝరి(బి) గ్రామాల్లో పర్యటించారు. పనుల వివరాలతో పాటు కూలీలకు చెల్లించిన డబ్బుల వివరాలను నమోదు చేస్తున్నట్లు ఎస్ఆర్పీ రాఘవులు పేర్కొన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈజీఎస్ ఏపీవో గంగాధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విఠలేశ్వర దర్శనానికి వేళాయె

- ఆలయంలో ఇప్పటికే కొనసాగుతున్న తాళసప్తాహం
- 10న పెద్దజాతర, 11న దేవతామూర్తుల శోభాయాత్ర
- తరలిరానున్న వివిధ గ్రామాల భక్తులు



మందిరంలో దేవతామూర్తులు



కుభీర్‌లోని విఠలేశ్వర మందిరం

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందింది. ఈనెల 10న ఆదివారం చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలతో విఠలేశ్వరుని జాతర ప్రారంభమవుతుంది. సోమవారం తెల్లవారుజామున కాగడ హారతి, భజనల నడుమ గ్రామంలో శోభాయాత్ర నిర్వహిస్తారు. అనంతరం విఠలరుక్మిణి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి సుమారు 40 క్వింటాళ్ల బియ్యంతో భక్తులకు అన్నదానం చేస్తారు. జాతరకు వారంరోజుల ముందు నుంచే ఆలయంలో తాళసప్తాహం నిర్వహిస్తున్నారు. 400 ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయంలో ఏటా కార్తీకమాసంలో నిర్వహించే జాతరకు సమీప ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు తరలివస్తారు. శుభకార్యాలు, నూతన పనులు ప్రారంభించే ముందు భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తుంటారు.

ఆకట్టుకుంటున్న ఆలయ ప్రాంగణం..

విఠలేశ్వరస్వామి ఆలయంలో రాతిస్తంభాలపై చెక్కిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఆలయ ప్రాంగణంలో హనుమాన్ మందిరం, గణేశుడి మందిరం, నవగ్రహాలు, శివాలయం ఉన్నాయి. ఏటా జాతర ఏర్పాట్లు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతాయి. ఈ కమిటీలో అన్ని కులాలవారు సభ్యులుగా ఉంటారు.



ఆలయంలో కొనసాగుతున్న తాళసప్తాహం

మందిరంలో కొనసాగే కార్యక్రమాలు..

మహారాష్ట్రలోని పండరీపురం తర్వాత పురాతనమైంది కుభీర్‌లోని విఠలేశ్వరాలయమే. నిత్యం ఉదయం ఆరు గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. కార్తీకమాసంలో నెలరోజులపాటు తెల్లవారుజామున 5:30 గంటలకే కాగడ హారతి చేపట్టగా వందలాది మంది భక్తులు పాల్గొంటారు. కృష్ణాష్టమి, ఉగాది, శ్రీరామనవమి, గణేశుడి ఉత్సవాలు, దేవీనవరాత్రులు తదితర కార్యక్రమాలు మందిరంలో ఘనంగా జరుపుకొంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు ఎక్కువ మంది గ్రామస్తులు వివాహాలు కూడా ఇక్కడే జరిపిస్తారు.

దీక్షలతో ప్రశాంతత

మండలంలోని ఆయా గ్రామాల నుంచి పలువురు మహారాష్ట్రలోని పండరిపురం విఠలేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లి దీక్షలు స్వీకరిస్తుంటారు. ఇలా ఒకసారి దీక్ష తీసుకున్నవారు మద్యం, మాంసానికి దూరం ఉంటారు. దీక్షలతో మానసికంగా ప్రశాంతంగా ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు.

ఏర్పాట్లు పూర్తిచేశాం



జాతర ఏర్పాట్లను పూర్తి చేశాం. మహారాష్ట్రలోని వివిధ గ్రామాల్లోని భక్తుల కు భజనలతో జాతరకు రావాలని కబురు పంపాం. ఆలయంలో తాళసప్తాహం, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఒక్కో కులానికి ఒక్కో పని అప్పగించాం. అందరూ వచ్చి ఆలయంలో అన్ని పనులు చేస్తున్నారు.

– పరశురాం, ఆలయ కమిటీ అధ్యక్షుడు, కుభీర్

నూతన మందిరం నిర్మిస్తున్నాం



మా గ్రామంలో పండరిపురం వెళ్లి విఠలేశ్వరస్వామి దీక్ష స్వీకరించినవారు వందకుపైగా ఉంటారు. గ్రామంలో ప్రస్తుతం విఠలేశ్వర మందిరం నిర్మిస్తున్నారు. ప్రతి సంవత్సరం మా గ్రామం నుంచి పాదయాత్రగా మహారాష్ట్రలోని పండరిపురం జాతరకు వెళ్తాం. దీంతో మాకు ప్రశాంతంగా అన్పిస్తుంది.

– బందెల శంకర్, పార్డి(కె)

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

పెంబి: మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి అంబాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని అంకెన, కర్ణంలొద్ది, వెంకంపోచంపాడ్ గ్రామాల్లో పర్యటించారు. డ్రెయినేజీలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లలో చెత్తసేకరణ, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

తానూరు మండలంలో..

తానూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఆష్పాక్ హైమద్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోంద్రట్, బెల్‌తరోడా గ్రామాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా బోంద్రట్ గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి లబ్ధిదారుల వివరాలు, అందిస్తున్న మెనూ తెలుసుకున్నారు. బెల్‌తరోడాలో రోడ్డుకు ఇరువైపుల నాటిన మొక్కలను పరిశీలించి ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



పెంబి: వెంకంపోచంపాడ్‌లో ఎరువుల తయారీ పరిశీలిస్తున్న అంబాజీ



తానూరు: బెల్‌తరోడాలో మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి హైమద్

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

సారంగాపూర్: చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారి విద్యాప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి గంగాధరయ్య అన్నారు. మండలంలోని జామ్, ఆలూరు, ధని గ్రామాల్లో పర్యటించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలను పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జామ్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు, కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం వివరాలను నమోదు చేసుకున్నారు. నర్సరీలను పరిశీలించి కార్యదర్శులు అశోక్, ఫిషాన్‌లకు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీఓ సరోజ, పశువైద్యాధికారి ముక్తార్, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



సారంగపూర్: జామ్ పాఠశాలలో విద్యార్థి సామర్థ్యం తెలుసుకుంటున్న గంగాధరయ్య

పంట రక్షణకు పాట్లు



పంటను కాపాడుకునేందుకు చేను చుట్టూ చీర కట్టిన రైతు

- చేలను ధ్వంసం చేస్తున్న అడవిజంతువులు
- ఆందోళనలో రైతులు
- చుట్టూ చీరలు కట్టి పంటను కాపాడుకుంటున్న వైనం

ముధోల్: ఆరుగాలం కష్టించి సాగు చేస్తున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. ఖరీఫ్ పంటలు చేతికందిన తర్వాత రైతులు యాసంగి పంటలను సాగు చేశారు. ముధోల్ మండలంలో ఆరుతడి పంటలైన శనగ, మొక్కజొన్న, ఎర్రజొన్న, జొన్న పంటలను సాగు చేయగా ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో శనగ పంట 1300 ఎకరాల్లో, మొక్కజొన్న పంట 600 ఎకరాల్లో, ఎర్రజొన్న 120 ఎకరాల్లో సాగు చేశారు. కానీ అడవి జంతువులు గుంపులుగుంపులుగా వచ్చి పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్కువగా పందుల బెడద

ముధోల్ మండలంలో పంటలను జంతువులు, జింకలు, అడవిపందులు ధ్వంసం చేస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి నది పరివాహక ప్రాంతాలైన ఆష్టా, బోరిగాం గన్నోరా గ్రామాల్లో ఎక్కువగా జింకలు, అడవిపందుల బెడద ఎక్కువగా ఉండటంతో రైతులు రాత్రివేళ చేన్ల వద్దకు కాపలా వెళ్తున్నారు. ముధోల్ మండల కేంద్రంతోపాటు బ్రహ్మణ్‌గావ్, రువ్వి, గన్నోరా, రాంటెక్, ఎడ్‌బిడ్ గ్రామాల్లో సైతం అడవి పందుల బెడద ఎక్కువగానే ఉంది.

పాతచీరలే దిక్కు..

తమ పంటలను రక్షించుకునేందుకు గ్రామాల్లో రైతులు పాతచీరలను రక్షణ వలయంగా చేన్ల చుట్టూ కడుతున్నారు. రైతులు రాత్రింబవళ్లు చేన్ల వద్దే ఉంటున్నారు. అటవీ అధికారులు స్పందించి అడవిజంతువులు తమకు పంటల వద్దకు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

రాత్రంతా చేను వద్దే..



మూడెకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఇప్పుడిప్పుడే ఏపుగా పెరుగుతోంది. ఓ పక్క కత్తెర పురుగుతో నష్టపోతే.. మరోపక్క జింకలు, అడవిపందులు గుంపుగుంపులుగా వచ్చి చేను నాశనం చేస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు రాత్రంతా చేను వద్దే కాపలా ఉంటున్నా. – ఓంసాయి, రైతు, చించాల

అధికారులు రక్షణ కల్పించాలి



కష్టపడి పండించిన పంట చేతికి రాకుండా పందులు, జింకల పాలవుతోంది. అటవీ శాఖ అధికారులు రైతుల పట్ల జాలి చూపి పంటలకు రక్షణ కల్పించాలి. అడవి జంతువులు పంటల వద్దకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలి.

– సాయినాథ్, రైతు, రాంటెక్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని సబ్‌స్టేషన్లలో నెలవారి మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంద ని ఏడీఈ రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 08:30 గంటల నుంచి 11 గంటల వరకు బుధవార్‌పేట్, పాతబస్టాండ్ ఏరియా, పాతకలెక్టరేట్ కార్యాలయం, ఇందిరానగర్, శాస్త్రీనగర్, ప్రియదర్శినినగర్, మైత్రినగర్, భాగ్యనగర్, బర్కత్‌పుర, చిక్కడపల్లి, చైన్‌గేట్, గొల్లపేట్, విజయనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: ఖానాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెంబి33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఖానాపూర్ ఏఈ తిరుపతి, పెంబి ఏఈ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లి, బీర్నంది, పాత ఎల్లాపూర్‌తోపాటు పెంబి సబ్‌స్టేషన్, కడెం మండలం లింగాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముస్తాబవుతున్న ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్



కార్యాలయంలో రంగులు వేస్తున్న కార్మికుడు

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబవుతోంది. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో నూతన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు క్యాంపు కార్యాలయం వేదికగా ప్రజల అవసరాలు, ప్రభుత్వ అధికారులతో సమీక్షలు నిర్వహించేందుకు భవనాన్ని రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. దీంతో సుమారు ఏడాది తర్వాత కార్యాలయం పునఃప్రారంభం కానుంది.

వేధిస్తే పోలీసులకు సమాచారమివ్వండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుమాంజలి

నిర్మల్‌రూరల్: ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్సై సుమాంజలి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆపదలో మహిళలు డయల్ 100 లేదా షీ టీం నెంబరు 87126 59550ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను వివరించాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రమాదేవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

భైంసాటౌన్: ఇటీవల ఆకస్మిక గుండెపోటు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని ఆరోగ్య భారతి రాష్ట్ర సభ్యులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాల, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. శిక్షకులు గణేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రవి

ఖానాపూర్: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఆసం రవి అన్నారు. శుక్రవారం మండలంలోని బావాపూర్(ఆర్) తండాలో వ్యవసాయశాఖ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడారు. సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని భారతీయ వరి పరిశోధన స్థానం వారు రూపొందించిన కిట్ ద్వారా భూసార పరీక్షపై రైతులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినేశ్, ఫౌండేషన్ సభ్యులు రత్నాకర్, కృష్ణారావు, చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

నర్సరీల్లో పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న శ్యామ్‌రావు

లక్ష్మణచాంద: మొక్కలు పెంచే నర్సరీల్లో మట్టి నింపే ప్రక్రియ వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీల్లో పనులకు వచ్చే ఉపాధి కూలీ లకు అవగాహన కల్పించాలని సూచించారు. ని త్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్ట డంతోపాటు ఇంటి పన్నుల వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలి

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేకాధికారి మసార్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు నర్సరీ, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శులు సారిక, కవిత, రమ్య తదితరులు ఉన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి



ఎమ్మెల్యే రామారావును సన్మానిస్తున్న నేతలు

భైంసాటౌన్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన ఎమ్మెల్యేను సత్కరించారు. రామారావు పటేల్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి తనవంతు సహకారం అందిస్తానన్నారు. వైస్‌చైర్మన్ జేకే.పటేల్, ఏఎంసీ కార్యదర్శి అడెల్లు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వాస్తాపూర్ గ్రామస్తులు

లోకేశ్వరం: భైంసాలోని తన నివాసంలో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను శుక్రవారం మండలంలోని వాస్తాపూర్ గ్రామస్తులు కలిశారు. గ్రామంలో సీసీరోడ్లు, మురికి కాలువలు, అంగన్‌వాడీ కేంద్రానికి భవనం, హనుమాన్ ఆలయం ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. భోజన్న, సాయన్న, మంద భాస్కర్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. జర పట్టించుకోరూ..



తానూరు: భైంసా-తానూరు ఎక్స్‌రోడ్డు నుంచి ఉమ్రి(కే) గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు భారీవర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీష్, పీఆర్ ఏఈ, **ఫోన్:** 91211 35623